క్లుప్తంగా

ఆలయానికి విరాళం



విరాళం ఇస్తున్న ఎంపీపీ పద్మ దంపతులు

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని శ్రీ రాజ రాజేశ్వర ఆలయ అభివృద్ధి కోసం ఎంపీపీ అడ్వాల పద్మ–రమేశ్ దంపతులు రూ.50వేలను విరాళంగా అందజేశారు. సోమవారం విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఎంపీపీ దంపతులతోపాటు కమిటీ సభ్యులు రాజు, రాజన్న తదితరులు ఉన్నారు.

ఉచిత బస్‌పాస్ అందించాలి

భైంసాటౌన్: లింగభేదం లేకుండా విద్యార్థులందరికీ ఉచిత బస్‌పాస్‌లు అందించాలని పీడీఎస్‌యూ నాయకులు కోరారు. సోమవారం పట్టణంలోని ఆర్టీసీ డిపోలో మేనేజర్ అమృతను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వాగ్మారే మహేందర్, రాజారాం, గంగరాజు ఉన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు అందుకున్న వారితో చర్చి పాస్టర్లు

ఖానాపూర్: క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని సోమవారం మండలంలోని బీర్నంది గ్రామంలోని 26 పేదకుటుంబాలకు దుప్పట్లను అందజేశారు. కడెం మండలంలోని క్యాథలిక్ చర్చి సహకారంతో వీటిని పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో క్యాథలిక్ చర్చి ఫాదర్ జోషి, బ్రదర్ రాగుల రాకేశ్, సిస్టర్లు డాలీ, జిమ్లా, డేసి తదితరులున్నారు.

ముందస్తు క్రిస్మస్ వేడుకలు

కడెం: మండలంలోని పెద్దబెల్లాల్ గ్రామ సమీపంలోని క్యాథలిక్ చర్చిలో ఆదివారం రాత్రి క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదిలాబాద్ క్యాథలిక్ చర్చి బిషప్ ప్రిన్స్ అంథోని కేక్ కట్ చేసి, క్రీస్తు ఇచ్చిన సందేశం వివరించారు. ఫాదర్ జోషి, పెద్దబెల్లాల్, తదితర గ్రామాల క్రైస్తవులు ఉన్నారు.

పొదుపు అలవాటు చేసుకోవాలి

కుంటాల: ప్రతి ఒక్కరూ పొదుపు అలవాటు చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని టీజీబీ మేనేజర్ సంతోష్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని వెంకూర్ గ్రామంలో పొదుపుపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బీమా పథకాలతోపాటు డిజిటల్ లావాదేవీలపై కళాజాత నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభాకర్, కల్పన, విక్రమ్, వీడీసీ చైర్మన్ దత్తు రాంపటేల్, దిగంబర్, వీఓఏ మోహన్ రావుపటేల్ తదితరులున్నారు.

'కేసీఆర్ పాలనలో ప్రజాస్వామ్యం అపహాస్యం'

ఖానాపూర్: గతంలో కేసీఆర్ పాలనలో ప్రజాస్వామ్యం అపహాస్యమైందని ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి పీటర్ అన్నారు. సోమవారం ఖానాపూర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎంగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన మొదటిరోజు నుంచే ఇనుప కంచెలను తొలగించచి ధర్నాచౌక్‌పై ఆంక్షలు ఎత్తివేయడం హర్షణీయమని పేర్కొన్నారు.

విద్యార్థుల క్షేత్ర సందర్శన

భైంసాటౌన్: పట్టణంలోని శ్రీగౌతమి ఉన్నత పాఠశాల విద్యార్థులు క్షేత్ర సందర్శనలో భాగంగా పట్టణ శివారులోని మిషన్ భగీరథ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ అధికారులు విద్యార్థులకు యంత్రాల ద్వారా నీటి శుద్ధీకరణ, పైప్‌లైన్ ద్వారా ఇంటింటికీ నీటి సరఫరా వ్యవస్థను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉన్నారు.

మొక్కు కోసం కొండగట్టుకు కాలినడకన మహిళలు



న్యూబొప్పారం నుంచి వెళ్తున్న మహిళలు

సోన్: ఇటీవల ఎన్నికల్లో నిర్మల్ ఎమ్మెల్యేగా మహేశ్వర్‌రెడ్డి గెలుపొందినందుకు మండలంలోని న్యూబొప్పారం మహిళలు సోమవారం కొండగట్టుకు కాలినడకన బయలుదేరారు. హనుమాన్ ఆలయంలో పూజల అనంతరం మొక్కు తీర్చుకునేందుకు కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయం వద్దకు వెళ్లారు.

24న మహా పడిపూజ

ఖానాపూర్: పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో ఈనెల 24న మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ ఆధ్వర్యంలో మహాపడిపూజ మహోత్సవం నిర్వహించనున్నట్లు బీజేపీ నాయకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పడిపూజకు భక్తులు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

సర్కారుబడిలో సౌకర్యాలేవి.?

- కుంసర ప్రాథమిక పాఠశాలలో మరుగుదొడ్లు, మూత్రశాలలు కరువు
- ఐదు తరగతులకు రెండే గదులు
- వరండాలోనే పిల్లలకు బోధన
- బిల్లులు రాక నిలిచిన భవన నిర్మాణ పనులు



తరగతి గదిలో దెబ్బతిన్న గచ్చు



పిల్లర్ల వరకు నిర్మించి వదిలేసిన పాఠశాల భవనం



వరండాలో పాఠాలు చెబుతున్న టీచర్

భైంసారూరల్: ప్రైవేటుకు ధీటుగా సర్కారుబడిలో వసతులు కల్పించి నాణ్యమైన విద్య అందిస్తున్నామని అధికారులు, పాలకులు చెబుతున్న మాటలు క్షేత్రస్థాయిలో కానరావడం లేదు. భైంసా మండలంలోని కుంసర ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కనీస సౌకర్యాలైన తాగునీరు, మరుగుదొడ్లు, తరగతి గదులు లేవు. దీంతో ఉపాధ్యాయులు విద్యార్థులకు వరండాలోనే పాఠాలు బోధిస్తున్నారు. ఐదు తరగతులకు గాను రెండే గదులు ఉండటంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు.

మన ఊరు– మన బడిలో ఎంపిక..

విద్యార్థుల సమస్యలు పరిష్కరించేందుకు కుంసర పాఠశాలను మన ఊరు– మన బడి కింద ఎంపిక చేశారు. అందుకు తగినట్లే మన ఊరు–మనబడిలో పాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి రూ.42లక్షలు మంజూరు చేశారు.

పిల్లర్లు వేసి పనులు నిలిపేశారు..

మనఊరు–మనబడిలో కుంసర ప్రభుత్వ పాఠశాలకు మంజూరైన నిధులతో అదనపు గదుల కోసం భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. పిల్లర్ల వరకు నిర్మించిన కాంట్రాక్టర్ బిల్లులు రాకపోవడంతో పనులు నిలిపివేశారు. దీంతో పాఠశాల భవనం అర్ధాంతరంగా నిలిచింది. అధికారులకు పలుమార్లు విన్నవించినా స్పందన కరువైందని గ్రామస్తులు, ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

వరండాలోనే తరగతులు..

కుంసర ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఐదు తరగతులు ఉన్నాయి. ఐదు తరగతులకు కలిపి రెండే గదులు ఉన్నాయి. గతంలో 70 మంది విద్యార్థులు ఉండేవారు.

గదులు సరిపోక ఈ విద్యాసంవత్సరం ప్రారంభంలో 30 మంది ఇతర పాఠశాలలకు వెళ్లిపోయారు. ఉన్న ఈ రెండు గదులు కూర్చునేందుకు వీల్లేకుండా గచ్చు అంతా గుంతలమయంగా కన్పిస్తున్నాయి. గచ్చు పగుళ్లు ఏర్పడి మట్టి పైకి కన్పిస్తుంది. చేసేదేం లేక ఉపాధ్యాయులు కూడా వరండాలోనే పిల్లలకు పాఠాలు చెబుతున్నారు.

ఇప్పటికైనా అధికారులు స్పందించి అదనపు గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేసి సమస్య పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా విద్యార్థుల సమస్యపై దృష్టి సారించాలని గ్రామస్తులు విన్నవిస్తున్నారు.

సౌకర్యాలు కల్పిస్తే ప్రవేశాలు పెరుగుతాయి



ఈ పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులం పనిచేస్తున్నాం. గతంలో 70 మంది పిల్లలు ఉండేవారు. భవనంలో గదులు సరిపోక ఈయేడు 30 మంది విద్యార్థులు వెళ్లిపోయారు. మరుగుదొడ్లు, గదులు నిర్మిస్తే విద్యార్థుల ప్రవేశాలు పెరుగుతాయి. విద్యార్థులకు కనీసం మరుగుదొడ్లు లేకపోవడంతో వారంతా ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి గదులు నిర్మించాలని కోరుతున్నాం.

– జయశ్రీ, ప్రధానోపాధ్యాయురాలు

సకాలంలో బిల్లులు రాకనే..

మనఊరు–మన బడిలో కుంసర పాఠశాలలో భవన నిర్మాణానికి రూ.42లక్షలు మంజూరయ్యాయి. సకాలంలో బిల్లులు రాకనే కాంట్రాక్టరు పనులు నిలిపివేశారు. బిల్లులు మంజూరైతే సమస్య పరిష్కారమవుతుంది. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటాం.

– భార్గవ్, సర్వశిక్ష అభియాన్ ఏఈ

ఆరు గ్యారంటీలు అమలు చేస్తాం

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



లబ్ధిదారులతో ఎమ్మెల్యే బొజ్జు

దస్తురాబాద్: కొద్దిరోజుల్లోనే ఎన్నికల వేళ కాంగ్రెస్ హామీ ఇచ్చినట్లు ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. సోమవారం ఉట్నూర్‌లోని ఎమ్మెల్యే నివాసంలో మండలంలోని పలువురు లబ్ధిదారులకు ఎన్నికల కోడ్‌తో నిలిచిపోయిన కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. అంతకుముందు బుట్టాపూర్‌లో సమస్యలు పరిష్కరించాలని ఆ గ్రామ నాయకులు ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ జాకీర్, నాయకులు గుండా నరేశ్, పుల్యా నాయక్, రవి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

తాగు, సాగునీటి సమస్యలు పరిష్కరించండి

- అధికారులతో ముధోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామారావుపటేల్

భైంసాటౌన్: నియోజకవర్గంలో ప్రజలకు తాగు, సాగు నీటి సమస్యలు లేకుండా పరిష్కరించాలని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావుపటేల్ ఆయా శాఖల అధికారులకు సూచించారు. సోమవారం పట్టణంలోని తన నివాసంలో సంబంధిత శాఖల అధికారులతో నియోజకవర్గంలో నెలకొన్న తాగు, సాగునీటి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, మరమ్మతులపై ఆర్అండ్‌బీ అధికారులతో సమీక్షించారు. మిషన్ భగీరథ కింద తప్పనిసరిగా ఇంటింటికీ తాగునీరు అందించాలని ఆదేశించారు.

బస్సు నడిపించాలని వినతి

కుంటాల: మండలంలోని మెదన్‌పూర్, అంబుగామ గ్రామాలకు బస్సు నడిపించాలని సోమవారం ఎమ్మెల్యే రామారావు పటేల్‌కు వినతిపత్రం అందజేశారు. తన నివాసంలో ఎమ్మెల్యేను కలిసిన వారిలో సర్పంచ్ చంద్రకాంత్ పటేల్, ఎంపీటీసీ కట్ట రవి, బీజేపీ మండల కన్వీనర్ దిగంబర్ పటేల్, లక్ష్మణ్ పటేల్, ప్రభాకర్, గంగాధర్ తదితరులు ఉన్నారు.

బోరిగాంలో మాజీ మంత్రి పర్యటన



మాట్లాడుతున్న మాజీ మంత్రి ఐకెరెడ్డి

లక్ష్మణచాంద: మండలంలోని బోరిగాం గ్రామంలో మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పర్యటించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బోరిగాంలో బీఆర్ఎస్‌కు మెజార్టీ వచ్చిన విషయం తెలిసిందే. గ్రామస్తుల వినతి మేరకు మాజీ మంత్రి సోమవారం గ్రామానికి వెళ్లి ప్రజలతో మాట్లాడారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని.. అండగా ఉంటానని హామీ ఇచ్చారు. వారి వెంట ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ రాజేందర్, జెడ్పీటీసీ రాజేశ్వర్, సురేందర్ రెడ్డి, కృష్ణారెడ్డి, అర్జున్‌రెడ్డి, గంగారాం, ముత్యం, గణేశ్, రాజేందర్ యాదవ్, సుభాశ్‌రావు, రమేశ్, నరేశ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రారంభమైన చించాల జెడ్పీ ఉన్నత పాఠశాల

- తరగతులు ప్రారంభించిన ఎంఈవో
- హర్షం వ్యక్తం చేసిన విద్యార్థులు, గ్రామస్తులు



మధ్యాహ్న భోజనం కోసం వరుసలో విద్యార్థులు

ముధోల్: మండలంలోని చించాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల సోమవారం పునఃప్రారంభమైంది. ఈ పాఠశాలలోని 6,7,8 తరగతుల విద్యార్థులను నాలుగు కిలోమీటర్లలోని ఎడ్‌బిడ్ పాఠశాలకు తరలించారు. దీంతో విద్యార్థులు చించాలలోనే తరగతులను నిర్వహించాలని నిరసన వ్యక్తం చేశారు. దీనిపై ఈనెల 18న సాక్షిలో 'మా ఊళ్లోనే చదువు చెప్పండి' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి విద్యాశాఖ అధికారులు స్పందించారు. డీఈవో రవీందర్‌రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం ఎంఈవో మైసాజీ చించాల ఉన్నత పాఠశాలకు వచ్చి 6,7, 8 తరగతులను పునఃప్రారంభించారు. మూడు నెలల తర్వాత తరగతులు ప్రారంభం కావడంతో విద్యార్థులు ఉత్సాహంగా పాఠశాలకు హాజరయ్యారు. ఉదయం ప్రార్థనతోపాటు, మధ్యాహ్న భోజనాన్ని ఎంఈవో దగ్గరుండి పరిశీలించారు. ఇతర పాఠశాలలకు వెళ్లిన చించాల ఉపాధ్యాయులను తిరిగి పాఠశాలకు రప్పించనున్నట్లు ఎంఈవో తెలిపారు. గ్రామంలోనే తరగతుల ప్రారంభంపై గ్రామస్తులు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

సాక్షి స్పందన

అయ్యప్ప ఆలయంలో పూజలు



ఖానాపూర్ : పూజలో పాల్గొన్న మహిళలు

ఖానాపూర్: పట్టణంలోని శ్రీలలితా పరమేశ్వరి అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. సుబ్రమణ్యస్వామి షష్టిని పురస్కరించుకొని అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం అర్చకులు నర్ర నితీశ్, విజయ్ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అడిదెల రాజన్న భక్తులు పాల్గొన్నారు.

కుంటాల: మండల కేంద్రంలోని జక్కుల రమేశ్ నివాసంలో సోమవారం అయ్యప్ప మహా పడిపూజను నిర్వహించారు. గణపతి, సుబ్రహ్మణ్యం, కుమారస్వామి అయ్యప్ప చిత్రపటాలను అలంకరించి, 18 పడిమెట్లకు దీపాలను వెలిగించారు. గురుస్వామి గజేంద్ర ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాలతో అభిషేకం జరిపించారు. అనంతరం స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు.

నూతన ఓటర్లను నమోదు చేయాలి



ఖానాపూర్‌లో హాజరైన బీఎల్‌వోలు



కడెంలో మాట్లాడుతున్న డీటీ చిన్నయ్య

ఖానాపూర్: నూతన ఓటర్లను నమోదు చేసి జాబితాను పకడ్బందీగా రూపొందించాలని డిప్యూటీ తహసీల్దార్ మంజుల బూత్‌లెవెల్ అధికారులకు సూచించారు. సోమవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఖానాపూర్, పెంబి మండలాల బీఎల్‌వోలకు ట్రెయినీ అధికారులు రమేశ్, జగన్ ఆధ్వర్యంలో శిక్షణనిచ్చారు. బీఎల్‌వోల విధులు, ఓటరు నమోదు, సవరణ తదితర విషయాలపై వారికి పరీక్షలు నిర్వహించారు. తప్పుల సవరణతోపాటు ఓటర్లకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది ఉన్నారు.

కడెం: మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం కడెం, దస్తురాబాద్ మండలాల్లోని బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ చిన్నయ్య నూతన ఓటర్ల నమోదు, ఓటరు జాబితా సవరణల గురించి అవగాహన కల్పించారు. ఇందులో రెవెన్యూ, సిబ్బంది ఉన్నారు.

21న బీఎల్‌వోలకు సమావేశం

లోకేశ్వరం: మండల కేంద్రంలోని రైతువేదికలో ఈనెల 21న మండలంలోని బీఎల్‌వోలకు సమావేశం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మోతీరాం ఓ ప్రకటనలో తెలిపారు. బీఎల్‌వోలు సకాలంలో హాజరు కావాలని కోరారు.

తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి



ముధోల్ కార్యాలయంలో హాజరైన అధికారులు

లక్ష్మణచాంద: తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల విభాగం(ప్రజావాణి)ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రీలత ప్రజలకు సూచించారు. సోమవారం కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆమె మాట్లాడా రు. ఇప్పటివరకు అందిన అన్ని విభాగాల దరఖాస్తులను పరిశీలించి.. సమస్యలు పరిష్కరించామని పేర్కొన్నారు. ఎంపీడీవో చంద్రశేఖర్, ప్రవీణ్‌కుమార్, ఎంపీవో నసీరుద్దీన్, మండల పశువైద్యాధికారి అజయ్‌కుమార్, ఏపీవో ప్రమీల, ఏపీఎం వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

తానూరు మండలంలో..

తానూరు: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల విభాగంలో పలువురి నుంచి దరఖాస్తులు స్వీకరించినట్లు తహసీల్దార్ లింగంమూర్తి అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల విభాగం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్‌రావ్, ఎంపీవో మోహన్‌సింగ్, ఐసీడీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముధోల్ మండలంలో..

ముధోల్: తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి పలు శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోవాలి ముధోల్‌లోని నయాబాదిలో సబ్‌స్టేషన్ పక్కన, తహసీల్దార్ కార్యాలయం వెనుక ఇలా పలు చోట్ల ఏర్పాటు చేస్తున్న అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోవాలని సోమవారం ప్రజావాణిలో స్థానికులు ఫిర్యాదు చేశారు. దీనిపై ఈవో పోతన్నయాదవ్ మాట్లాడుతూ అక్రమ వెంచర్లు ఏర్పాటు చేసిన వారికి నోటీసులు అందించామన్నారు. గడువులోగా పత్రాలు చూపకుంటే మూడు రోజుల్లో వాటిని తొలగిస్తామని పేర్కొన్నారు.



కాలక్షేపం చేస్తున్న జిల్లా మైనింగ్ అధికారి



వార్తలు చూస్తున్న ఎక్సైజ్‌శాఖ సిబ్బంది



నిద్రలోకి జారుకున్న శిశుసంక్షేమ అధికారి

ప్రజావాణిలో హల్ 'సెల్'

జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి జిల్లా నలుమూలల నుంచి పేదప్రజలు వచ్చి తమ బాధలను జిల్లా స్థాయి అధికారులకు విన్నవించి పరిష్కరించాలని వేడుకుంటారు. కానీ ప్రజావాణిలో పాల్గొన్న అధికారులు మాత్రం బాధితుల సమస్యలు పట్టనట్లు సెల్‌ఫోన్‌లో నిమగ్నమయ్యారు. మరికొందరు నిద్రలోకి జారుకున్నారు. సోమవారం ప్రజావాణిలో జరిగిన దృశ్యాలివీ.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



సెల్‌ఫోన్ చూస్తున్న మైనార్టీ అధికారి

బాధిత కుటుంబాలకు పరామర్శ



న్యూలింగంపల్లిలో పరామర్శిస్తున్న శ్రీహరిరావు

మామడ: మండలంలోని కొరిటికల్, న్యూలింగంపల్లి గ్రామాల్లో సోమవారం బాధిత కుటుంబాలను డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు పరామర్శించారు. కొరిటికల్ గ్రామంలో కొండ్ర ప్రజ్ఞ, న్యూలింగంపల్లిలో కాశవ్వ ఇటీవల మృతి చెందారు. వీరి కుటుంబాలను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రఫీ, శేఖర్, బాపయ్య, నర్సారెడ్డి తదితరులు ఉన్నారు.

కామోల్‌లో..

భైంసారూరల్: మండలంలోని కామోల్ గ్రామంలో దృపతిబాయి గ్యాస్ సిలిండర్ పేలి సజీవ దహనమైన విషయం తెలిసిందే. సోమవారం గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని మాజీ జెడ్పీటీసీ సూర్యకాంత్‌రెడ్డి పరామర్శించారు. వారి వెంట పీఏసీఎస్ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, ప్రతాప్‌సింగ్, అమేందర్ తదితరులున్నారు.

ఈరోజు

మండల సర్వసభ్య సమావేశం

లక్ష్మణచాంద: స్థానిక ఎంపీడీవో సమావేశ మందిరంలో మంగళవారం లక్ష్మణచాంద మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో చంద్రశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ఎంపీపీ పద్మ అధ్యక్షతన జరిగే సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

ఎమ్మెల్యే రాక

పెంబి: మండలంలోని మందపల్లి గ్రామంలో నిర్మించిన కేజీబీవీ పాఠశాల భవనం ప్రారంభోత్సవానికి మంగళవారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ రానున్నట్లు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు స్వప్నిల్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఆలయ వార్షికోత్సవం

ఖానాపూర్: పట్టణంలోని శివాజీనగర్ కాలనీలో ఉన్న మహాలక్ష్మి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం మంగళవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవాలకు భక్తులు హాజరై ప్రత్యేక తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

అన్నపూర్ణదేవికి ముక్కుపుడక బహూకరణ



ఆలయంలో భక్తులు

కుంటాల: మండలకేంద్రంలోని శ్రీ ఉమామహేశ్వర ఆలయంలో అన్నపూర్ణదేవికి మాజీ ఎంపీపీ అరుణ రమణారావు కుటుంబసభ్యులు సోమవారం రూ.37వేల విలువైన బంగారు ముక్కు పుడకను బహూకరించారు. వారిని ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. గురుస్వామి గజేందర్, అర్చకులు వినయ్‌పాండే, సంతోష్, సంజీవ్, గణపతి, రాజ్‌కుమార్, రమేశ్ ఉన్నారు.